ప్రజాశక్తి

బుధవారం 7 మే 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

శంకర్‌విలాస్ బ్రిడ్జికి నేడు శంకుస్థాపన

- కేంద్ర మంత్రి పెమ్మసానితో పాటు హాజరుకానున్న పలువురు రాష్ట్ర మంత్రులు
- వినతులను త్రోసిరాజని యథాతథంగా డిపిఆర్ వైపు మొగ్గు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో చారిత్రక నిర్మాణంగా ఉన్న శంకర్ విలాస్ ఆర్‌వోబి నిర్మాణానికి బుధవారం స్థానిక ఎసి కళాశాల వద్ద శంకుస్థాపన జరగనుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర మంత్రులు బిసి జనార్ధన్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. రూ.98 కోట్లతో ఎసి కళాశాల నుంచి అరండల్‌పేట 9 లైను వరకు బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి నిర్మాణం 1958లో నిర్మించారు. 65 ఏళ్ల తరువాత పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం సేతు బంధన్ పథకం ద్వారా రూ.98 ▶ 2లో



ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు సమస్యలు వివరిస్తున్న జెఎసి నాయకులు

శంకర్ విలాస్ ఆర్‌ఓబి డిజైన్ మార్చాలి

ప్రజాశక్తి-గుంటూరుల

బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన జెఎసి నాయకులు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఆర్‌ఓబికి బుధవారం శంకుస్థాపన నేపథ్యంలో జెఎసి నాయకులు కలిసి కొత్త డిజైన్ వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, సవరణలు, ట్రాఫిక్ సమస్యలు, సర్వీసు రోడ్డు ఇబ్బందులపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆర్అండ్‌బి ఇచ్చిన నమూనా వల్ల కొన్ని ఇబ్బందులున్నాయని, తాను కూడా కొన్ని సవరణలు సూచించానని, ఒకటి రెండ్రోజుల్లో కేంద్ర మంత్రితో సమావేశం ఏర్పాటు చేస్తామని, అందులో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముందుగా ఆర్‌యుబి నిర్మించాలని, అదనపు గ్రాంట్ తెప్పించి ఫ్లైఓవర్ నిర్మాణం జరిగేలా చూడాలని జెఎసి నాయకులు కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎల్.ఎస్.భారవి, మల్లికార్జునరావు, ఎ.హరి, వెంకటరావు, కార్తీక్, శ్రీనివాసరావుమూర్తి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్

అమరావతి నుండి నిజాంపట్నం పోర్ట్‌కు 4లైన్ల రహదారి

వివిధ ప్రభుత్వ శాఖలతో బాపట్ల ఎంపి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు నుండి నిజాంపట్నం పోర్ట్ వరకు కొత్తగా (గ్రీన్ ఫీల్డ్) నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంపై స్టేక్ హోల్డర్స్‌తో కలక్టరేట్‌లో మంగళవారం సమావేశం జరిగింది. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల కలెక్టర్ జె.వెంకటమురళి, బాపట్ల ఎంపి టి.కృష్ణప్రసాద్, గుంటూరు జేసీ భార్గవ్‌తేజ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎమ్మెల్యే వి.నరేంద్రవర్మ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు నుండి నిజాంపట్నం పోర్ట్ వరకు 47.848 కిలో మీటర్ల వేరకు రోడ్డు నిర్మాణం వల్ల ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని, వస్తు రవాణా సదుపాయం పెరుగుతుందని అన్నారు. ఈ నాలుగు లైన్లరోడ్డు నిర్మాణానికి సంబంధిత కేంద్ర మంత్రులతో అనేక దఫాలుగా చర్చించి వారిని ఒప్పించి ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేసినట్లు చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే సూర్యలంక బీచ్‌కు, చీరాల బీచ్‌తో పాటు అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలు, పొన్నూరులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం పర్యటకంగా భివృద్ధి చెందుతాయని చెప్పారు. వైజాగ్-చెన్నయ్ ఇండస్ట్రీయల్ కారిడార్‌కు మంచి కనెక్టివిటీ ఏర్పడుతుందని, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌కు ఎక్కడా ▶ 2లో

మాట్లాడుతున్న హరిబాబు



బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి-గుంటూరు

బర్లీ పొగాకును నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. మంగళవారం బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 86వేల ఎకరాలు బర్లీ పొగాకును రైతులు అనేక వ్యయప్రయాసలకోర్చి సాగు చేశారన్నారు. గతంలో క్వింటాళ్ రూ.18 వేలకు కొనుగోలు చేయగా, ఈ ఏడాది కేవలం రూ.4 వేలు మాత్రమే ధర వస్తోందన్నారు. అప్పులు చేసి పంట పండించారని, రాష్ట్ర ప్రభుత్వం కలుగచేసుకొని, క్వింటాళ్ కనీసం రూ.15 వేలకు కొనుగోలు చేయాలని, దీనిపై వ్యవసాయ శాఖామంత్రి, కంపెనీలు వెంటనే స్పందించాలని కోరారు. ఈదురు గాలులకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మిర్చి, వరి, కంది పెసర, అరటి, శనగ పంటలను మద్దతు ధరలకు కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతులకు, దేవాలయ భూములు సాగు చేసే రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ పనులు ప్రారంభించాలని, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బొట్ల రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, పి.కృష్ణ, రామకృష్ణ, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆ ధరకు అమ్మండి.. లేకపోతే పొండి..

పొగాకు రైతులతో కంపెనీ అధికారులు... నాణ్యత పేరుతో తిరస్కరణ

ప్రజాశక్తి - రెంటచింతల

రైతులకు పొగాకు సాగు శాపంగా మారింది రూ.లక్ష రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పొగాకును కొనుగోలుకు మేదరమెట్లలోని కంపెనీ అధికారులు నాణ్యత లోపాన్ని చూపుతున్నారని, 150 బేళ్లను వెనక్కి పంపించారని సాగుదారులు వాపోతున్నారు. ఇష్టం వచ్చినట్లుగా ధరల్లో కోతలు విధిస్తున్నారని, గట్టిగా మాట్లాడితే.. నాణ్యత లేదు.. తక్కువ ధరకు ఇస్తే ఇవ్వండి.. లేకపోతే వెనక్కు తీసుకెళ్లండి... అంటున్నారని చెబుతున్న రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. రెంటచింతల మండలంలో గోలి, పసర్లపాడు, తుమ్మురకోట గ్రామాలకు చెందిన రైతులు 40 ఏళ్ల తర్వాత పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయంగా 180 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు ▶ 2లో



పంటలన్నింటినీ మద్దతు ధరకు కొనాలి

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చీడపీడలు, తెగుళ్ల అప్పులు చేసి పెట్టుబడులు సమకూర్చుకుని సాగు చేపట్టగా అంతంతమాత్రంగా దిగుబుడులు, మద్దతు ధరలు లేకపోవడం, వ్యాపారులు, దళారులు, దోపిడీ ఇలా అన్ని విధాలుగా రైతులు దోపిడీకి గురవుతున్నారని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని, ఈ-క్రాప్ తో సంబంధం లేకుండా అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మిర్చి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, కనీస మద్దతు ధరలకు చట్టం చేయాలని కోరారు. పంటలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. పంట ఉత్పత్తి ▶ 2లో

రేషన్ మాఫియాపై పోలీసుల కొరడా

- అడ్డుకుంటున్న పౌరసరఫరాల శాఖ
- ఎమ్‌డియు వాహనాల అక్రమాలకు డిటిల వత్తాసు

- 2 లో

సివిల్స్ ర్యాంకర్ పవన్ కళ్యాణ్‌కు మేయర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

సివిల్స్ జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించిన చల్లా పవన్ కల్యాణ్‌ను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మంగళవారం తన ఛాంబర్‌లో అభినందించారు. గుంటూరు నగరానికి చెందిన చల్లా పవన్ కల్యాణ్ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించటం అభినందనీయం అన్నారు. నేటి యువత చల్లా పవన్ కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చల్లా రమేష్, కసుకర్తి హనుమంతరావు, వంశీ పాల్గొన్నారు.



అమరావతి నుండి నిజాంపట్నం పోర్ట్‌కు 4లైన్ల రహదారి

(మొదటి పేజీ తరువాయి)

అవరోధం లేకుండా రోడ్డు ఏర్పడడం వల్ల మరింత ఆర్థికాభివృద్ధి బలోపేతం అవుతుందని వివరించారు. రోడ్డు నిర్మాణ పనులకు అన్ని అనుమతులు పొందిన తరువాత ఆరు మాసాల్లోపు భూసేకరణ పనులు పూర్తి చేయాలని, 18 మాసాల్లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. అనంతరం స్టేక్ హోల్డర్స్ అయిన ఆర్‌అండ్‌బి, విద్యుత్, ఇరిగేషన్, రైల్వే, ఫిషరీస్, అగ్రికల్చర్, పంచాయితీ రాజ్, దేవాదాయ శాఖ, అటవీ శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి ఏదైనా అంశాలుంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రం లోపు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. వారు అందించిన వివరాలను క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేసి ఢిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ వారికి పంపి రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరతామని తెలిపారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్టు పార్వతీశం, డిఆర్‌ఒ ఎన్.ఎస్.కే.ఖాజావలి, పంచాయితీ రాజ్ ఎస్‌ఇ బ్రహ్మయ్య, డిపిఒ నాగసాయికుమార్ పాల్గొన్నారు.

ఆ ధరకు అమ్మండి.. లేకపోతే పొండి..

(మొదటి పేజీ తరువాయి)

మొదట్లో రూ.15,500 ధర కల్పిస్తామని చెప్పిన కంపెనీలు ఇప్పుడు రూ.6 వేలకు మించి కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడు ఎకరాల్లో సాగు చేసిన రైతు మేదరమెట్లలోని వేలం కేంద్రంలో అమ్మడానికి వెళ్లగా కొనుగోలుదారులంతా సిండికేట్‌గా ఏర్పడి నాణ్యత సాకుతో రూ.6 వేలకు మించి కొనలేదని, దీంతో ఎకరాకు రూ.40 వేల నష్టం వచ్చిందని రైతు ఆవేదన చెందాడు. కంపెనీ వాళ్ల మాటలు విని అనవసరంగా సాగు చేసి చేతులు కాల్చుకోవాల్సి వచ్చిందని మరో రైతు వాపోయారు.

పంటలన్నింటినీ మద్దతు ధరకు కొనాలి

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించాలనే డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారస్సులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని సత్వరమే అమలు చేయాలన్నారు. రబీలో పల్నాడు జిల్లాలో వరి లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి లక్ష్యంగా ఉంటే కేవలం 10 వేల మెట్రిక్ టన్నులే ప్రభుత్వం కొనుగోలు చేస్తామనడం సరికాదని, మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలను, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.

పారదర్శకంగా పోలీస్ సిబ్బంది బదిలీ : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : పోలీసు శాఖలో సిబ్బంది బదిలీలను అత్యంత పారదర్శకతతో చేస్తున్నట్టు జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన బదిలీల ప్రక్రియను చేపట్టారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల పాటు సర్వీసు పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ నుంచి ఎఎస్‌ఐ వరకు బదిలీ జరుగుతుందన్నారు. ఎఎస్సైలు – 12 మంది, హెడ్ కానిస్టేబుళ్ళు – 27, కానిస్టేబుళ్లు – 27మంది మొత్తం 66 మందిని బదిలీ చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లోనీ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించిన వారికి వారి అభీష్టం మేరకు పట్టణ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల జారీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ల పరిధిలోనే కుటుంబంతో నివాసం ఉండాలని, అప్పుడే వారితో ఎక్కువ సమయం గడపడానికి అవకాశం ఉంటుందని సూచించారు.

నేటి నుంచి యోగా శిక్షణ

ప్రజాశక్తి – మంగళగిరి: మంగళగిరి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి దేవస్థా నం ఆవరణలో శ్రీ రాధాకృష్ణా యోగ సేవా కేంద్రం ఆధ్వ ర్యంలో ఈనెల 7వ తేదీన ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణా యోగి గురూజీ మంగళవారం తెలిపారు. మూడు వారాలు పాటు యోగాసనములు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉదయం 6 నుండి 7:30 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

రేషన్ మాఫియాపై పోలీసుల కొరడా

- **అడ్డుకుంటున్న పౌరసరఫరాల శాఖ**
- **ఎమ్‌డియు వాహనాల అక్రమాలకు డిటిల వత్తాసు**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఒంగోలులో టిడిపి నాయకుడు వీరయ్యచౌదరి హత్యతో రేషన్ మాఫియాను కట్టడి చేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలతో పోలీసు శాఖ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించింది. అయితే పౌరసరఫరాల శాఖ అధికారులు అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. ప్రధానంగా ఎండియు వాహనదారుల అక్రమాలకు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు వత్తాసు పలుకుతున్నారు. ఈ వ్యవహారం పోలీసు శాఖకు, పౌరసరఫరాల శాఖకు మధ్య అంతుర్యద్దానికి దారితీస్తోంది. గుంటూరు నెహ్రూనగర్‌లో ఇటీవల పోలీసులు ఒక ఎండియు వాహనందారుడు వినియోగదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇవ్వడాన్ని నిఘా వేసి పట్టుకున్నపోలీసులకు పౌరసరఫరాల శాఖ అధికారి ఒకరు ఇబ్బందికరంగా మాట్లాడరని తెలిసింది. మొత్తం వాహనంలో 38 బస్తాలకు గాను మూడు బస్తాలు ఉన్నాయని, 35 బస్తాలు దారిమళ్లించారని పోలీసులు దర్యాప్తులో తేలడంతో రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులకు వారు సమాచారం ఇచ్చారు. అయితే సంబంధిత డిప్యూటీ తహశీల్దార్ తగిన చర్యలు తీసుకోకుండా పోలీసులను మీకేం పని అని నిలదీసినట్టు తెలిసింది. పోలీసులు గట్టిగా మాట్లాడటంతో అప్పుడు చర్యలు తీసుకుంటామని సర్ది చెప్పినట్టు తెలిసింది. అయితే ఇప్పటి వరకు ఈ వాహనదారుడిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా బేరసారాలు చేస్తున్నట్టు డీలర్లలో ప్రచారం జరుగుతోంది. ఎండియు వాహనదారుడు రమేష్‌బాబు 38 బస్తాల బియాన్ని అక్రమంగా దారిమళ్లిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని అయినా డిప్యూటీ తహశీల్దార్ ఎటువంటి చర్యలు తీసుకోలేదని నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన కూటమి పార్టీల కార్యకర్తలు పలువురు సిఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అలాగే ఇటీవల నగరంపాలెం పోలీసులు స్థానిక మల్లారెడ్డి నగర్ ఇస్కాన్ దేవాయలం వద్ద రేషన్ బియ్యంను గోతాల్లోకి మార్పిడి చేస్తుండగా పట్టుకున్నారు. గుంటూరులో నిత్యం పలు ప్రాంతాల్లో ఎండియు వాహనదారులు రేషన్ మాఫియాదారులతో కలిసి కొన్ని రహస్య స్థావరాల ద్వారా బియ్యంను ప్రభుత్వ ముద్రలు ఉన్న గోతాల నుంచి వేరే గోతాల్లోకి మార్పిడి చేస్తూ ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో రేషన్ మాఫియాలో కీలక భూమిక పోషించిన వైసిపికి చెందిన వారే కూటమి ప్రభుత్వంలో కూడా యథేశ్చగా అక్రమ వ్యాపారాన్ని యథేశ్చగా కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో అడపాదడపా దాడులు జరిగేవి. ఇప్పుడు ఏ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితినెలకొంది. తాజా పరిణామాలపై నివేదికలు తెప్పించుకున్న సిఎం చంద్రబాబు నాయుడు పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారని తెలిసింది. నిత్యావసర సరుకులు అందించే రేషన్ వాహనాల (ఎండియు) వాహనదారులను గుప్పిట్లో పెట్టుకున్న మాఫియా ఏ వాహనం ఎక్కడికి పోవాలో నిర్ధేశిస్తున్నారు. ఎండియు వాహనాల్లో వెళ్తున్న బియ్యం ప్రజల కోసం తీసుకువెళ్తున్నారన్న భావనతో ఇప్పటి వరకు పోలీసులు పట్టించుకోలేదు. ఇటీవల పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు పెంచడంతో అక్రమాలు కొన్ని అయినా బయటకు వస్తున్నాయి. రేషన్ అక్రమాలను నియంత్రించాల్సిన వివిధ శాఖల అధికారులు వాహనదారుల వద్ద, అక్రమ వ్యాపారం చేసే వారి వద్ద నుంచి నెలవారీ మామూళ్ల తీసుకుని వారికి పూర్తిస్థాయిలో సహకరిస్తూ వినియోగదారులదే తప్పు అని ఉన్నతాధికారులకు మౌఖిక నివేదికలు ఇస్తున్నారు.

శంకర్‌విలాస్ బ్రిడ్జికి నేడు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు నిధులు కేటాయించింది. నాలుగు లైన్ల వెడల్పుతో మొత్తం 930 మీటర్ల పొడవుతో నిర్మాణానికి డిపిఆర్ సిద్ధం చేశారు. బ్రిడ్జికి ఇరు వైపులా 23 అడుగుల చొప్పున సర్వీసు రోడ్డుకు అనుమతి ఇవ్వనున్నారు. బ్రాడీపేట 4 వ లైను, అరండల్‌పేట 5వ లైను, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మాత్రమే అండర్‌పాస్‌కు అనుమతి ఇవ్వనున్నారు. బ్రిడ్జి నిర్మాణం 9 మీటర్ల ఎత్తులో జరగనుంది.

అయితే ఈ బ్రిడ్జి నిర్మాణంపై పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు అభ్యంతరాలు తెలిపినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పలు మార్పులకు అంగీకరించ లేదు. లాడ్జి సెంటరు నుంచి హిందూ కళాశాల వరకు ఐకానిక్ బ్రిడ్జి ప్రతిపాదన 2017లో చేశారని, దీనిని పరిశీలించాలని ప్రజాసంఘాల జెఎసి మొరపెట్టుకున్నా ప్రజా ప్రతినిధులు,అధికారులు ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. ఈ ప్రాజెక్టు మొత్తం 120 అడుగుల రోడ్డు విస్తీర్ణంలో ప్లాను చేశారు. 70 అడుగుల వెడల్పుతో 930 మీటర్ల నిడివితో బ్రిడ్జిని నిర్మించబోతున్నారు. 70 అడుగుల బ్రిడ్జితో రెండు వైపుల ఐదు అడుగుల చొప్పున మొత్తం పది అడుగులు ఫుట్‌పాత్‌లు రానున్నాయి. మొత్తంగా 60 అడుగుల వెడల్పుతో నాలుగు లైన్ల బ్రిడ్జినిర్మాణం జరగనుంది. ఎర్త్‌వాల్‌తో కట్టే బ్రిడ్జి కనుక అండర్ పాస్‌లు ఇచ్చిన ప్రాంతం మినహా మిగతా ప్రాంతమంతా రవాణాకు ఆటంకమేనని చెబుతున్నారు. బ్రిడ్జి నిడివి కుదించటం వలన పశ్చిమ వైపు ఎనిమిది తొమ్మిది లైన్ల మధ్య ప్రారంభమై తూర్పు వైపు రాష్ట్ర ప్రాంతీయ గ్రంథాలయానికి అంటే కో–పరేటివ్ సూపర్ బజార్ దగ్గర పూర్తవుతుంది. 23 అడుగుల సర్వీసు రోడ్డు నిర్మించినా డ్రెయిన్లకు కేటాయించిన స్థలం పోను కేవలం 18 అడుగులు మాత్రమే ఉంటోందని దీనిని పెంచాలని కోరినా అంగీకరించలేదు. ఆర్‌వోబి నిర్మాణం కంటే ఆర్‌యూబి నిర్మాణం చేపట్టాలనే జెఎసి డిమాండ్‌ను కూడా పెడచెవిన పెట్టారు. ఇప్పుడు ఆర్‌యూబి సాధ్యం కాదని ఆర్‌వోబి నిర్మాణం తరువాత ఆర్‌యూబి విషయాన్ని పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ చర్యలూ నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. నిత్యం 50 వేల వాహనాలు ఈ బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగించే పరిస్థితుల్లో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మధ్య రాకపోకలకు రాబోయే రెండేళ్ల ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు.



సిఎంను కలిసిన జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

ప్రజాశక్తి – వినుకొండ : సిఎం చంద్రబాబుని వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు మంగళవారం కలిశారు. ఛైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జీవీ ఆంజనేయులు విలేకర్లతో మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. న్యాయవాదులను వెంట తీసుకుని వెళ్లి వినుకొండలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు, నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించాలని, ఓల్టేజీ సమస్య ప్రాంతాల్లో విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఉపాధి హామీ పథకం పెండింగ్ బకాయిలు విడుదల, ఈపూరు, దొండపాడు ఎన్‌ఎస్‌పి కాల్వలపై తూములు ఏర్పాటు చేసి ఈపూరు, దొండపాడు చెరువులకు నీరు సరఫరా చేసేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు.

లారీ కిందపడి ఒకరు మృతి

ప్రజాశక్తి – దుర్గి



లారీ ఢీకొని వ్యక్తి మతి చెందిన సంఘటన మండల కేంద్రమైన దుర్గిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మాచర్లకు చెందిన మామిళ్ల అంజి (45) కాగితాలు ఏరుకొని వాటిని అమ్ముకుని జీవిస్తున్నారు. మంగళవారం ఉదయం దుర్గిలోని జెడ్‌పి పాఠశాల వద్ద కాగితాలు ఏరుకుంటుండగా అదే సమయంలో మాచర్ల నుండి ఒంగోలు వెళుతున్న కెసిపి సిమెంట్ లోడ్ లారీ హై స్కూల్ దగ్గర్లో ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను దాటుతుండగా మామిళ్ల అంజి తీసుకు వెళుతున్న కాగితాల మూట లారీకి తాకింది. దీంతో అంజి కింద పడిపోవడంతో ఆయనపైకి లారీ వెనక టైర్లు ఎక్కి రెండు కాళ్లు నలిగిపోయాయి. క్షతగాత్రుణ్ని 108లో మాచర్లకు తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు దుర్గి ఎస్సై సుధీర్ కుమార్ కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ బత్తుల శ్రీనివాసును అదుపులోకి తీసుకున్నారు.

నేడు ఉపకరణాలు పంపిణీ శిబిరం

ప్రజాశక్తి – చేబ్రోలు : వికలాంగులు, వృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పొన్నూరు పట్టణంలోని రేపల్లె బస్టాండ్ వద్ద ఉన్న జెడ్‌పి పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

తెనాలిలో రేపు అర్హుల ఎంపిక

ప్రజాశక్తి – తెనాలి : వికలాంగులు, వృద్ధులకు గురువారం స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉపకరణాల పంపిణీకి అర్హుల ఎంపిక జరుగుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు. హైదరాబాదుకు చెందిన ఆర్టిఫిషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో), జిల్లా పరిపాలన యంత్రాగం సహకారంతో వీల్ చైర్స్, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతి కర్రలు, లెప్రసీ కిట్, కృత్రిమ అవయవాలు, వృద్ధులకు చేతి కర్రలు, వీల్‌చైర్లు అందిస్తారని తెలిపారు. క్యాంపుకు హాజరయ్యేవారు సదరం క్యాంపు సర్టిఫికెట్, ఆధార్, ఆదాయ ధ్రువీకరణ, యూనిక్ డిజేబుల్ కార్డ్, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు. వృద్ధులు ఆదాయ ధ్రువీకరణ, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9849347904, 9959127045 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలికల భవితకు 'కిశోరి వికాసం'

ప్రజాశక్తి–తెనాలిరూరల్ : రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం ద్వారా కౌమారదశ బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించవచ్చని సిడిపిఒ డాక్టర్ ఎం సునీత అన్నారు. స్థానిక 22వ వార్డు మారీస్ పేట, మఠం బజారు అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటుచేసిన "కిశోరి వికాసం" వేసవి శిక్షణ కార్యక్రమంలో సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం పేరుతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా మంగళ వారం రుతుక్రమ పరిశుభ్రత, నిర్వహణ, లైంగిక విద్య అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ నుం చి అజయ్‌కుమార్, కార్యక్రమ కన్వీనర్లు సౌమ్య, డి ఝాన్సీ రాణి, అంగన్వాడి కార్యకర్తలు కె.జ్యోతి, మణి శిరో మణి, ప్రేమలత, ఎఎన్‌ఎం, ఆశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగడ్తలతోనే సరిపెట్టారు

రాజధాని పునర్నిర్మాణ సభపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి- తాడేపల్లి

వెనకటికి ఎవడు మా ఊరి మిరియాలు తాటికాయ అంతా అన్నాడట... ఈ సామెత సరిగ్గా ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సరిగా సరిపోతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఎద్దేవా చేశారు. రాజధాని పునర్నిర్మాణం ప్రారంభోత్సవం పేరుతో ఈ నెల రెండో తేదీ అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకరినొకరు పొగుడుకోవడం సరిపోయిందని విమర్శించారు, రాజధానికి నిధులు ఇవ్వకుండా మాటలు చెప్పి, చాక్లెట్ చేతిలో పెట్టి వెళ్ళారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఇటీవల కురిసిన అకాల వర్షం, గాలి వాన బీభత్సంతో నష్టపోయిన అరటి పొలాలను సిపిఐ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, అరటి తదితర వాణిజ్య పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కాకుండా మరో రెండు వేల ఎకరాలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంట దెబ్బతిన్న రైతులకు 24 గంటల్లో నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే అధికారులు ఇంతవరకు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, నష్టపరిహారం అంచనాలు వేయకుండా రైతులను ఎలా ఆదుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనలు మాని కార్యాచరణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు.



అకాల వర్షానికి నేలవాలిన అరటి పొలాలను పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తదితరులు

అతనికంటే ఘనుడు అచంట మల్లన్న లాగా పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులు దగ్గర నుండి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని చెప్పే మాటలు వాస్తవంగా లేవని చెప్పారు. కూటం ప్రభుత్వం రాష్ట్రంలో 10 నెలల పాలనలో ఇప్పటివరకు రైతులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం ఏమైందని ప్రశ్నించారు. అకాల వర్షం ఈదురుగాలి వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య,సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య, ముసునూర్ సుహాస్,గుంటక సాంబిరెడ్డి,జవ్వాది సాంబశివరావు,కూరపాటి సింగయ్య,రైతులు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి శ్రీధర్‌బాబు ఆదర్శప్రాయులు

ప్రజాశక్తి-గుంటూరు

గత 90 నెలలుగా టొబాకోబోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా నిబద్ధత, నిజాయితీ గల సీనియర్ ఐఎఎస్ అధికారిగా డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు విశిష్ట కృషి చేశారని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ పావులూరి రమేష్ అన్నారు. అద్దంకి శ్రీధర్‌బాబు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి బదిలీ అయిన సందర్భంగా మంగళవారం గుంటూరులోని జ్యోతి నిలయం హాలులో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పావులూరి రమేష్ మాట్లాడుతూ టొబాకో బోర్డును రైతుల పాలిట కల్పవక్షంగా మార్చారని, పొగాకు రైతుల సమస్యలను అర్థంచేసుకొని పరిష్కార మార్గాలను అధ్యయనం చేసేవారని తెలిపారు. అనేక మంది విద్యార్థులకు సరైన త్రోవ చూపిస్తూ వ్యక్తిత్వ వికాస నిపుణులుగా లక్షలాది మంది విద్యార్థులను ప్రభావితం చేశారన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నేడు బ్యూరోక్రసీ అధికార పార్టీ నేతల జోక్యంతో శక్తివంతంగా పనిచేయలేక పోతుందని, అవినీతిమయంగా మారిందని, ఇలాంటి పరిస్థితులలో డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు నిజాయితీతో, నిబద్ధతో అవినీతి రహితంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. యువత, విద్యార్థుల్లో ఉత్తేజాన్ని కలిగించడానికి శ్రీధర్‌బాబు రచించిన 'మీరూశ్రీలు' అనే గ్రంథం వేలాది మందిని ప్రభావితం చేసిందన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం అధ్యయనం చేయాలని గమ్యాలను, లక్ష్యాలను రూపొందించుకుని వాటి సాధన కోసం ఇష్టపడి చదవాలన్నారు. విద్యతోపాటు జనరల్



శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న పావులూరి రమేష్, లక్ష్మణరెడ్డి, తదితరులు

నాలెడ్జ్‌ను పెంచుకుంటూ, డిబేటింగ్, వ్యాసరచన లాంటి పోటీలలో పాల్గొనాలని తెలిపారు. స్వయంకృషితో ఎదిగిన మహనీయుల జీవితాలను అధ్యయనం చేయాలన్నారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎన్.అరవింద్, స్టెప్ ప్రెసిడెంట్ ప్రత్యూష సుబ్బారావు ప్రసంగించారు. అనంతరం జిడిఎస్‌ఎస్డబ్ల్యూఎస్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, మానవత, స్టెప్ సంస్థల నేతలు డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప్పల సాంబశివరావు, బి.ఎన్. మిత్ర, హర్ష, టి. ధనుంజయ రెడ్డి, నల్లమోతు సాంబశివరావు, బాలకృష్ణ చౌదరి, టొబాకో బోర్డు అధికారులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధమని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని పురసేవ కేంద్రం, కాల్ సెంటర్‌లో బుధవారం నుండి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజారోగ్య రక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చేయూత ఇస్తున్నాయన్నారు. ఇంటిలో స్థలం ఉండి, మరుగుదొడ్లు లేని వారు జిఎంసిలో దరఖాస్తు చేసుకోవాలని, రైస్‌కార్డ్, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోన్ నంబర్, కుల ధృవీకరణ, బ్యాంక్ అకౌంట్ వివరాలతో దరఖాస్తులు తీసుకొని పూర్తి చేసి అందించాలన్నారు. ప్రతి మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36,450లు మంజూరు చేయటం జరుగుతుందన్నారు.

విశ్రాంత హౌసింగ్ ఏఈ పాషా అరెస్టు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడులో హౌసింగ్ ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయినా పాషా ను అరెస్ట్ చేసినట్లు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో సిమెంట్ బస్తాలు 230 బస్తాలు, 97 మెట్రిక్ టన్నుల ఇనుము మాయం చేసినట్లు అప్పటి ఉన్నత అధికారులు గుర్తించారు. 2024 జూన్ 26వ తేదీన అప్పటి డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే పాషా కేసు విచారణకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో అతనిని గోరంట్లలోని అతని ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచునున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌలు రైతుల సమస్యలపై 13న ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కౌలు రైతుల సమస్యలపై ఎపి కౌలు రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో కంజుల విఠల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని, కౌలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

గుర్తింపు కార్డులు అందక, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క గుంటూరు జిల్లాలోనే పదుల సంఖ్యలో కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు అందించాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.నరసింహారావు, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి మన్నవ హరిప్రసాద్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.వి.జగన్నాథం, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వర రావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య వివిధ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.



మౌలిక వసతులు పెంచాలని మేయర్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ప్రజలకు మౌలిక వసతులను కల్పనకు ప్రాధాన్యత పెంచాలని పలువురు నాయకులు మేయర్ కోవెలమూడి రవీంద్రను కోరారు. కార్పొరేషన్‌లో మేయర్‌ను మంగళవారం పలువురు నాయకులు కలసి వివిధ అంశాలపై చర్చించారు. బిజెపి నాయకులు దర్శనపు శ్రీనివాసరావు, తిరుమలరావు, అవంతి శ్రీనివాసు, బిక్కు సురేష్, టిడిపి నాయకులు కసుకుర్తి హనుమంతరావు మాట్లాడుతూ తాగునీరు, రహదారులు, పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్‌కు శుభాకాం:క్షలు తెలిపారు.

10 నుంచి యూనివర్సిటీ కళాశాలలకు సెలవులు

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని 6 కళాశాలలకు ఈనెల 10వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. మంగళవారం ఇన్చార్జి రిజిస్టర్ ఆచార్య జి .సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ ప్రాంగణంలో ఉన్న అన్ని కళాశాలలకు ఈ తేదీలు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు.

నగరంలో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిఎంసి కౌన్సిల్ సమావేశమందిరంలో పారిశుధ్య పనుల నిర్వహణపై సచివాలయ ఎన్విరాన్మెంట్ మరియు ఎమినిటి కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని గుంటూరులో పారిశుధ్యం మెరుగుదలకు ప్రతి ఒక్కరూ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం దష్ట్యా పారిశుధ్య కార్మికులను దష్టిలో పెట్టుకొని ఉదయం 5 గంటల నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 గంటల నుండి 6 గంటల వరకు సమయాన్ని నిర్దేశించుట జరిగిందన్నారు. నగరంలో పారిశుధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సి.యమ.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, యస్.ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుదరరామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

20న సమ్మెలో అన్ని రంగాల కార్మికులు భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు


తాళ్లూరు పిహెచ్‌సిలో డాక్టర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్లు

కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు భాగస్వామ్యం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు మల్లేశ్వరి పిలుపునిచ్చారు. మండలంలోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్ల సమావేశం మంగళవారం నిర్వహించడంతోపాటు డాక్టర్ వెలిగొండరెడ్డికి సమ్మె నోటీసు అందిచారు. తొలుత సమావేశంలో మల్లీశ్వరి మాట్లాడుతూ కార్మిక వర్గం వందేళ్లకు పైగా పోరాటం చేసి సాధించుకున్న చట్టాలన్నింటిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్లను తెచ్చిందని చెప్పారు. వీటివల్ల కార్మిక వర్గం తిరిగి బానిసత్వంలోకి నెట్టబడుతుందని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్నారని, ఉద్యోగాల భర్తీని నిలిపేశారని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందని, మరవైపు నిత్యావసరాల ధరల పెరుగుదల కార్మిక వర్గపు ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తోందని చెప్పారు. అయితే ఉద్యోగుల జీతాల పెంపుదలకు ప్రభుత్వాలు అంగీకరించడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక అంగన్వాడీలు, ఆశా వర్కర్లు తదితర చిన్న ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందాలకు సంబంధించిన జీవోలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. చిన్న ఉద్యోగులకు కూడా సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. చిరుద్యోగుల్లో ఉండే దళితులకు గతంలో ఉన్న 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకాన్ని రద్దు చేస్తున్నారని చెప్పారు. ఈ అన్ని సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ జరిగే సమ్మెలో ఆశాలంతా పాల్గొనాలన్నారు.


సత్కారం పొందుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, గీత దంపతులు

చెప్పుల్లేకుండా తిరిగిన ఊళ్లోనే సత్కారం..

ప్రజాశక్తి - వినుకొండ

కళలు, సాహిత్యం, ప్రజా పోరాటాలకు పుట్టినిల్లయిన వినుకొండ తన సొంత ప్రాంతమని, నాడు చెప్పుల్లేకుండా తిరిగిన వీధుల్లోనే నేడు కారులో ఊరేగించడం ఆనందంగా ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జాషువా కళా ప్రాంగణంలో సోమవారం రాత్రి సన్మానించారు. తొలుత ఆయన్ను సురేష్ మహల్ సెంటర్ నుండి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫీస్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. శివయ్య, గంగినేని, జాషువా విగ్రహాలకు ఆయన పూలమాలలు వేశారు. అనంతరం సీనియర్ న్యాయవాది పీజే లూకా అధ్యక్షతన నిర్వహించిన సభలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ కవి పులుపుల శివయ్య చిన్న వయస్సులో వేలు పట్టి బిడ్డగా నడిపించారని గుర్తు చేసుకున్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ లక్ష్మీనారాయణను రాష్ట్ర ప్రభుత్వం సముచిత రీతిలో గౌరవించేలా కృషి చేస్తానన్నారు. వినుకొండలో జాషువా కల్యాణ మండపంతో పాటు మరో రెండు ఓపెన్ ఎయిర్ థియేటర్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ జాతీయ ఔన్నత్యాన్ని చాటే సాహితీవేత్తలు, కవులను ప్రభుత్వాలు గౌరవించాలని, అయితే తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అది కరవైందని అన్నారు. సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతం నుండి జాషువా తరువాత పెనుగొండ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు స్థాయికి ఎదగడం సంతోషకరమన్నారు. అనంతరం పెనుగొండ లక్ష్మీనారాయణ, గీత దంపతులను సన్మానించారు. కె.రామాంజనేయులు, మనీషా, డాక్టర్ పారా లక్ష్మయ్య, సీహెచ్ఎల్ఎన్ మూర్తి, షకీల, మారుతీ వరప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, ఎండ్లూరి శేషగిరిరావు పాల్గొన్నారు. పహల్గామ్ మృతులకు సభ నివాళులర్పించింది.

వక్ఫ్ ఆస్తులను కాజేయడానికే చట్టసవరణ

ప్రజాశక్తి - నకరికల్లు


సదస్సులో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

వక్ఫ్ సవరణ చట్టం ఆమోదయోగ్యంగా లేదని ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎంఎ చిష్టి అన్నారు. ఈ అంశంపై మండల కేంద్రమైన నకరికల్లులోని భగత్‌సింగ్ భవనంలో మంగళవారం అవగాహన సదస్సు పిడిఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. చిష్టి మాట్లాడుతూ మతం ముసుగులో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే పన్నాగంలో బిజెపి ఉందన్నారు. వక్ఫ్‌కు దానంగా ఇచ్చిన ఆస్తులను ఆక్రమించుకోవాలనే దుర్బుద్ధి సవరణ చట్టంలో ఉందన్నారు. దేశంలో అభివృద్ధి కుంటూ పడుతోందని, నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు భారాలు అనుభవిస్తున్నారని, వీటిని పరిష్కరించని ప్రభుత్వాలు మత చిచ్చు పెడుతున్నామని మండిపడ్డారు. ఈ కుట్రలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆవాజ్ మండల కమిటీని ఎన్నుకోగా కన్వీనర్‌గా షేక్ దరియావలి ఎన్నికయ్యారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ కౌలురైతు సంఘం మండల అధ్యక్షులు ఇ.లక్ష్మారెడ్డి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటనాయక్, షేక్ సుభాని, బాజీ, రబ్బానీ పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి

ఉద్యాన పంటల సాగుకు రైతుల్ని గుర్తించండి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

2025- 26 ఆర్థిక సంవత్సరము నకు గాను ఉపాధి హామీ చట్టం అనుసంధానంతో ఉద్యాన పంటలపై మాచర్ల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి, ఎపిడి మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, పంటలు వేసే రైతులను గుర్తించాలని సూచించారు. ఉద్యాన పంటల సాగు వల్ల కలిగే మేలు, వచ్చే ఆదాయంపై రైతులకు వివరించాలని చెప్పారు. సేద్యపు నీటి కుంటలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.



విద్యార్థుల నమోదుకు యుటిఎఫ్ కృషి అభినందనీయం : ఎంఇఒ

ప్రకాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు యుటిఎఫ్ చేపట్టిన రాష్ట్ర వ్యాప్తం కార్యాక్రమంలో భాగంగా రూపొందించిన కరపత్రాన్ని ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించే బాధ్యతను యుటిఎఫ్ తీసుకోవడం సామాజిక బాధ్యతగా భావించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు, నాయకులు కె.తిరుపతిస్వామి ఎమ్‌డి యాసీన్, కె.రవి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అనుచిత వ్యాఖ్యలకు ఎఎన్ఎంల నిరసన

ప్రజాశక్తి - రెంటచింతల

ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్ వైజర్ పట్ల ఎంఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డాక్టర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలో ఉన్న ఉద్యోగులు తామే గొప్ప అంటూ సాటి ఉద్యోగులను తక్కువ చేసి మాట్లాడడం తగదన్నారు. రాష్ట్ర నేతలు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శర్మ, ఆంజనేయులు సూపర్వైజర్లు, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.



వారాల తరబడి డబ్బులివ్వకుంటే కూలీల కుటుంబాలు ఎలా బతకాలి

ప్రజాశక్తి - అచ్చంపేట

ఉపాధి హామీ పనిచేసిన వారికి సకాలంలో కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాలను మంగళవారం సందర్శించిన ఆయన కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల వేతనాలను వారానికి ఒకసారి ఇవ్వాల్సి ఉన్నా వారాల తరబడి ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. కూలీలకు మజ్జిగ, తాగునీరు, పలుకు పారా అలవెన్సులు ఇవ్వాలని కోరారు. కామన్ వర్క్ ఐడీలు ఇవ్వటం వల్ల కూలీలు ఒకేచోటకు వచ్చి ఫొటోలు దిగాల్సి వస్తోదని, కొంతమందికి తక్కువ వేతనమూ వస్తోందని చెప్పారు. ప్రతి పనికి ఐడి నంబర్ ఇచ్చి ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 కూలి ఇవ్వాలని కోరారు. నిర్దేశించిన కొలతలు ప్రకారం పనిచేసి వేతనాన్ని రూ.500కు పెంచడంతోపాటు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై సంఘం చేసే పోరాటాల్లో కూలీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చేరిన పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర-స్టూడెంట్ కిట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు పెదకూరపాడు మండలానికి వచ్చినట్లు ఎంఇఒ టి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం పుస్తకాలు ముందస్తుగానే వచ్చాయని, కిట్‌లో పాఠ్యపుస్తకాలు, ఒక బ్యాగు, రెండు జతల యూనిఫామ్, జత బూట్లు, సాక్సులు, నోటు పుస్తకాలు, డైరీ ఉంటాయని తెలిపారు.



20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఆశా, పంచాయతీ వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో అధికారులకు సమ్మె నోటీసు



ఫిరంగిపురంలో ఆశాలతో మాట్లాడుతున్న వై.నేతాజీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు మే 20వ తేదీ జరిగే అఖిల భారత సమ్మెలో యావత్తు కార్మిక వర్గం భాగస్వామ్యం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపు నిచ్చారు. నుదురుపాడు పీహెచ్సీ వద్ద జరిగిన ఆశా వర్కర్స్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశంలోని కార్మిక వర్గం వందేళ్లకు పైగా పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలన్నింటిని కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తీసుకువస్తున్నదని దీని వల్ల కార్మిక వర్గం తిరిగి బానిసత్వంలోకి నెట్టబడుతుందని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్నారని ఉద్యోగుల రిక్రూట్మెంట్ నిలుపుదల చేశారని దేశంలో గతంలో ఏనాడు లేనంతగా నిరుద్యోగం నేడు ఉన్నదని అన్నారు. ధరల పెరుగుదల కార్మిక వర్గపు ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నదని అందుకు అనుగుణంగా కార్మికుల, ఉద్యోగుల జీతాలు పెంపుదలకు ప్రభుత్వాలు అంగీకరించటం లేదని అన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలు, ఆశా వర్కర్లు తదితర చిన్న ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందాలకు సంబంధించిన జీవోలు కూడా ఇవ్వడం లేదని దీనిపై ఉమ్మడి పోరాటానికి దిగాల్సిన అవసరం ఏర్పడుతున్నదనీ అన్నారు. చిన్న ఉద్యోగులకు కూడా వైధవ్య పెన్షన్ తో సహా అన్ని సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఇది ఇది ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మరింతగా దిగజార్చిందని అన్నారు. చిరుద్యోగులలో ఉండే దళితులకు గతంలో ఉన్న 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకాన్ని కూడా రద్దు చేస్తున్నారని ఇది తీవ్రమైన చర్య అని అన్నారు. మే 20వ తేదీన అఖిల భారత సమ్మె సందర్భంగా అన్ని మండల కేంద్రాలలో అన్ని రంగాల కార్మికులు ఉద్యోగులు భారీ ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం నుదురుపాడు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్‌కి సమ్మె నోటీసు అందియాకె, కార్యక్రమంలో నాయకులు పద్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు, కాకుమాను : ఈ నెల 20 వ తేదీ న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షురాలు వై.రమణ కోరారు. ఆశా వర్కర్స్ డే సందర్భంగా మంగళవారం పెదనందిపాడు పి.హెచ్.సి.వద్ద సి.ఐ.టి.యు.జండాను రమణ ఆవిష్క రించి ప్రసంగించారు. అనంతరం పి.హెచ్.సి. వైద్యాధికారి కమలాకర్‌కు ఆశా వర్కర్స్ సమ్మె నోటీసుని అందించారు. కార్యక్రమం లో సి.ఐ.టి.యు.మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, ఆశా వర్కర్స్ నాయకురాలు సరళాదేవి, వి.రాణి, ఎం.సరిత, టి.రత్నకుమారి పాల్గొన్నారు. కాకుమాను పిహెచ్‌సి మెడికల్‌ఆఫీసర్‌కు వై రమణ, ఆశాలు సమ్మెనోటీసు అందజేశారు.

ప్రజాశక్తి - పెదకాకాని, తాడికొండ : మండల కేంద్రమైన పెదకాకానిలో మంగళవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని తెలియజేస్తూ పెదకాకాని గ్రామ పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ రాజారాంకి, తాడికొండ ఎంపిపి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు మాట్లాడారు. కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులకు గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెరగలేదు మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న విధుల నే పంచాయతీ కార్మికులు కూడా నిర్వహిస్తున్నా రన్నారు. ఆరేళ్ళ క్రితం జీవో జారీ చేసిన జీవో నెంబర్ 132. 142. 680. జీవోలు నేటికీ అమలు కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం మే 20వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి రాజ రమేష్ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ పాలపర్తి ఆదిలక్ష్మి పి సుజాత కొండ రాజకుమారి రావినూతల మేరీ రోజు జైపాల్ ఆవాజ్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు. తాడికొండలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు నూతక్కి వీరయ్య, రాంమోహనరావు, కనగాల పూర్ణ చంద్రరావు, చింతల భాస్కరరావు, భద్రయ్య, జోజి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆశాలు సమ్మె నోటీసును అధికారులకు అందజేశారు. నిడమర్రు యుపి హెచ్ సీ అధికారులకు, ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ, అమృత యూనివర్సిటీలలో ఈ సమ్మె నోటీసులు అందజేసినట్లు సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. భాగ్యరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రాజు సి ఐ టి యు నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు: 20న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సమావేశం జరిగింది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి శ్రీనివాస్‌కు, విట్ యూనివర్సిటీలో సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండెపు రాజు తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో



తాడికొండలో



పెదనందిపాడులో



కాకుమానులో



నిడమర్రులో



తుళ్లూరులో

ఉపాధి హామీ కార్మికులకు తక్షణం వేతనాలివ్వాలి : వ్యకాస



వ్యకాస ఆధ్వర్యంలో ఎండిఒ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తాడికొండ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులకు మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడికొండ ఎండిఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ చంద్ర శేఖర్ కు సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఫిబ్రవరి నెల నుండి వేతనాలు చెల్లించకపోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాడికొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, సమ్మర్ అలవెన్సును 30శాతం ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి, అలాగే గాయపడిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వం జీవో తీసుకొచ్చిందని అమలు చేయాలన్నారు. పని ప్రదేశంలో చనిపోయిన వారికి రూ.రెండు లక్షలు, గాయపడిన వారికి లక్ష రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. పని ప్రదేశంలో కార్మికులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం తాడికొండ మండల నాయకులు బి .భద్రయ్య,సీఐటీయూ మండల అధ్యక్షులు యడ్లపల్లి గాంధీ రాంమోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు,కనగాల పూర్ణ చంద్రరావు జోషి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : ఇచ్చిన కొలతలు ప్రకారం పని చేస్తున్న సరైనవేతనం పడటం లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారని వ్యకాస జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని పెదకొండూరులో ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. గతంలో మజ్జిగ, మంచినీరు, పలుగులకు సాన కు డబ్బులు చెల్లించే వాళ్ళని ఇప్పుడు చెల్లించడం లేదని తెలిపారు. వారం రోజులు పని చేస్తే ఎంత కూలి, వస్తుందో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వం 307 రూపాయలు ప్రకటించినప్పటికీ ఆ విధంగా కూలి పడటం లేదని చెప్పారు. నెలరోజులు కూడా పని జరగటం లేదని చెప్పారు. వ్యవసాయ పనుల్లో ఉపాధి పనులు అమలు జరపడం లేదని అందువల్ల ఇబ్బంది పడుతున్నామని కూలీలు తెలిపారు. ఉపాధి హామీ పనులైన వంద రోజులు జరిపించి 300 వచ్చేట్టు చూడా లని కోరారు. కార్యక్రమంలో కే సంసోను కే నాగ రాజు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెదకొండూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బాలరాజు



విద్యార్థుల నమూనాను పరిశీలిస్తున్న రైతులు, శాస్త్రవేత్తలు

భూసార పరీక్షలతో భూమి సురక్షితం

లాం శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాత

ప్రజాశక్తి - కొల్లిపర : రైతు భూసార పరీక్షలు ప్రతి సంవత్సరము చేయించుకోవాలని, ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని లాం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పి సుజాత తెలిపారు. మంగళవారం కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో విద్యార్థులకు వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఏరువాక కేంద్రం లాం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు వ్యవసాయ పనులు, వివిధ పంటల చార్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో డాక్టర్ పి సుజాత మాట్లాడుతు వరి, జొన్న, మినుము, మొక్క జొన్న పంటల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి తెలుసుకొని పెట్టుబడి తగ్గించుకొనుటకు రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులు తయారు చేసిన నమూనాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సదస్సులో రైతులు తెలిపిన భూ సంబంధిత, పంట చీడ పీడల, ఎరువుల వినియోగం సంబంధిత సందేహాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు యెన్ . వెంకట లక్ష్మి కో ఆర్డినేటర్ ఏరువాక కేంద్రం, డాక్టర్ సి సంధ్య రాణి, డాక్టర్ డయాన గ్రీస్, డాక్టర్ సి హెచ్ సుజని రావు, డాక్టర్ ఎమ్ వెంకట రాములు పలు సూచనలు తెలియ చేశారు. సదస్సులో అత్తోట గ్రామ వ్యవసాయ సహాయకులు బి.సాయి కష్ణ, నంది వెలుగు గ్రామ వ్యవసాయ సహాయకులు యు. శివ సాయి తేజ మరియు అభ్యుదయ రైతులు యెర్రు వెంకయ్య నాయుడు,ఏర్రు వేంకటేశ్వర రావు, ఎస్ రవి ప్రసాద్, వై. బాపరావు, ఎన్. రోశయ్య, కే. సాంబశివరావు, నందివెలుగు, కొలకలూరు, కట్టెవరం, ఉప్పల పాడు రైతులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ



మాట్లాడుతున్న వై నేతాజి

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ వద్ధాప్య, వితం తు, వికలాంగ పెన్షన్లతోపాటు ప్రభుత్వం సూపర్ సిక్స్ లో భాగంగా ఇచ్చిన హామీ నిరుద్యోగ యువకులకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ మంగళగిరి నియోజక వర్గంలో మూడు వేల మందికి మాత్రమే ఇళ్ల పట్టాలిచ్చారని చెప్పారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, తమ పరిశీలనలో కూడా 20వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, అనేకమంది కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారందరికీ వెంటనే రేషన్ కార్డుల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్నం తో పాటు నియోజకవర్గంలో కొండ పారంబోకు, ఇరిగేషన్, కాలవగట్లు, దేవాదాయ, రైల్వే భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని 40 ఏళ్లు పైబడి ఉంటున్నా పేదలందరికీ వెంటనే పట్టాలి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో 40 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను అక్కడ ఎమ్మెల్యే కూల్చి వేయించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదల కు అండగా నిలిచిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పై శాసనసభ ఉపసభాపతి, స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు అవాకులు చవాకులు పేలడాన్ని ఖండించారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యు లు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, గాదే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ప్రశాంత్

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి. ప్రశాంత్

ప్రజాశక్తి - మాచర్ల

కార్మిక చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగియుండాలని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ప్రశాంత్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మాచర్ల మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని చెన్నకేశవనగర్ కాలనీలో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి.పార్థసారధి మాట్లాడుతూ కనీస వేతనం, ఎనిమిది గంటల పనిదినాలు, భద్రత, సంక్షేమం తదితర కార్మికుల హక్కులు, రక్షణకు చట్టాలు వున్నాయన్నారు. 18 సంవత్సరాలు లోపు వయస్సు వారితో ఎటువంటి పనులు చేయించకూడదన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు, ఎంఎల్ఎస్సి సభ్యుడు మెట్టు గోవింద రెడ్డి, కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న విజయకుమార్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

జిల్లా సూపర్ ఇంటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్

ప్రజాశక్తి - మాచర్ల

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని పల్నాడు జిల్లా సూపర్ ఇంటెండింగ్ ఇంజనీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ స్థానిక అధికారులను ఆదేశించారు. మంగళవారం మాచర్ల డిఈ పరిధిలోని సబ్‌స్టేషన్లు, కార్యాలయాన్ని, ఇఆర్ఓ ఆఫీసును విజయకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి నెల వందశాతం కలెక్షన్ వచ్చే విధంగా తగిన సలహాలు ఇచ్చారు. మాచర్ల టౌన్ సెక్షన్‌లో స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ అయిన ఎఫ్ క్లాస్–డి లిస్టులను, గన్నవరంను తనిఖీ చేసి 11కెవి ఫీడర్స్‌ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్‌లను తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని ఆదేశించారు. వీరితో బాటు మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. రామయ్య, మాచర్ల టౌన్ అసిస్టెంట్ ఇంజనీర్ సిహెచ్. కోటేశ్వరరావు, మాచర్ల రూరల్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ. శ్రీశైలం, మాచర్ల రూరల్ సెక్షన్ లైన్‌ఇన్‌స్పెక్టర్ రామేశ్వరరావునాయక్ పాల్గొన్నారు.

యడ్లపాడు పీహెచ్సీ లో ఆశావర్కర్ల సమావేశం

ప్రజాశక్తి - యడ్లపాడు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్య సేవలు అందించేందుకు ఆషాలు ముందుండాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎస్ పున్నారావు తెలిపారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఆరోగ్య పరిస్థితులపై సమీక్ష చేశారు. చివరిగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లను యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అనంతరం నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆస్తమా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్తమా లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలపై ఫౌండేషన్ చైర్మన్ నరేంద్ర సువర్ణ కుమారి, పీహెచ్సీ సిహెచ్‌ఓ పున్నారావు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు వై. ప్రసాదరావు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ కోసం స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి, అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం లింగంగుంట్ల గ్రామ పరిధిలో గల 200 పడకల ఏరియా ఆసుపత్రి భవన సముదాయంలో 75 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు కోసం మంగళవారం జిల్లా అధికారులు, నాయకులు స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ నరసరావుపేటలో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు వలన క్షతగాత్రులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ఎందరో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ 36.35 కోట్ల నిధులను మంజూరు చేశారని శంకుస్థాపన చేసి క్రిటికల్ కేర్ పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎస్‌పి కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుం జయ్ గనోరే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు శాస్త్రవేత్తలకు డిజిటల్ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏ.పి.సి.ఎన్.ఎఫ్) జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమల కుమారి జిల్లాలోని మెంటర్స్‌లకు మంగళవారం డిజిటల్ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల ఉష్ణోగ్రత, నేల తేమ, నేల పిహెచ్ ఉపరితల ఉష్ణోగ్రత, విత్తన తేమను కొలవడానికి ఈ అత్యాధునిక పరికరాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రైతు శాస్త్రవేత్తలు, మెంటర్‌లకు పొలంబడి ముఖ్య ఉద్దేశ్యం, దాని సూత్రాలు, ఆగ్రో ఎకోసిస్టమ్ అనాలిసిస్ ఎలా నిర్వహించాలనే విషయాలపై అమల కుమారి వివరణాత్మక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టిపిపి కిరణమై, డీపిపి. భవాని రాజు, శ్రీనివాస్ పలువురు మెంటర్లు, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

48వ రోజు కొనసాగుతున్న ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పనిచేసిన అన్ని రోజులకు వేతనాలు ఇవ్వాలని తొలగింపునకు గురైన మున్సిపల్ కార్మికులు చేస్తున్న ఆందోళన మంగళవారం 48వ రోజుకు చేరింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రెండు నెలలుగా పురపాలక సంఘం కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తమకు న్యాయం చేసే వరకూ ఆందోళన కొనసాగుతుందని ఉద్ఘాటించారు. ఇప్పటికైనా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రి, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



కృష్ణతేజను కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజను కలిశారు. నియోజకవర్గంలోని గ్రామాలలో బీటి రోడ్, సీసీ రోడ్ల నిర్మాణం మరమ్మతులు గురించి వివరించారు. కృష్ణతేజ సానుకూలంగా స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారని చెప్పారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజిపి డైరెక్టర్ షణ్ముఖను కలిసి 2015 – 19 వరకు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శాఖమూరి రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో దిగజారుతోన్న డాక్టర్ గోపిరెడ్డి

తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కుమ్మెత కోటిరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ మనుగడ కోసం రెచ్చగొట్టేలా వాఖ్యలు చేసి రాజకీయంగా దిగజారిపోతున్నారని మాజీ ఎమ్మెల్యే తన స్థాయిని మరిచి గ్రామ స్థాయి నాయకుని మాదిరి మాట్లాడడం అనవసర ఆరోపణలు చేయడం తగదని తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి హితవు పలికారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోటిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలి పించారని గుర్తు చేశారు. ఘోర ఓటమి పాలైన డాక్టర్ గోపిరెడ్డి ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో కుటిల రాజకీయాలు చేస్తున్నారనీ, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహ రిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఏక వచనంలో విమర్శించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అసత్య ఆరోపణలతో రాజకీయాలు చేద్దామనుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి రాజకీయ సన్యాసం తప్పదన్నారు. బుచ్చి పాపన్నపాలెం గ్రామంలో అన్ని పనులు సక్రమంగా జరుగుతున్నాయని నిజాయితీగా పనిచేసే అధికారులపై ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఏనుగంటి భార్గవ సాయి పాల్గొన్నారు.

జిల్లాల సరిహద్దు ప్రాంతాలలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రకాశం, పల్నాడు జిల్లా సరిహద్దు ప్రాంతాలలో మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టినట్లు సిఐడి వెంకటే శ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం సరిహద్దు గ్రామమైన గుట్లపల్లిలో నాటు సారా సంబంధిత నేరాలపై అవగాహన కల్పించామన్నారు. వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఇప్పటి వరకు బొల్లాపల్లి మండలంలో 18, ఈపూరులో 20, రొంపిచర్ల మండలంలో 20 కేసులు నమోదు చేసి 103 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. కల్లులో కల్తీ నివారణకు శాంపిల్స్ సేకరించి రసాయనిక పరీక్షలకు పంపించామన్నారు. నాటు సారా నియంత్రణలో భాగంగా గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో 11 మంది లబ్ధిదారులకు రూ 8.90 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమారుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆదిత్య మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పరిధిలో లేని వ్యాధుల బారిన పడి చికిత్స పొందిన వారికి కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులు అందిస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



మద్యం దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలనీ మద్యం దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ మద్యం దుకాణదారులను ఆదేశించారు. సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ల, నంది గామ, గ్రామాలలో ఉన్న ప్రైవేటు మద్యం షాపులలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెల్స్ మెన్‌లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కె. నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న మున్ని

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - పెదకూరపాడు

బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ మున్ని కోరారు. మంగళవారం మండలంలోని లగడపాడు పెదకూరపాడులో బాలికలకు కిషోర్ వికాసం పేరుతో అవగాహన కల్పించారు రుతుక్రమం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వీడియోలు చూపించి వారిని చైతన్య పరిచారు. తమ హక్కులను బాలికలు తెలుసుకోవాలని అన్నారు. జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్య క్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్ కోసం కిశోర వికాసం

ప్రజాశక్తి - బెల్లంకొండ

కిశోర వికాసం కార్యక్రమం బాలికలకు బంగారు భవిష్యత్తు, ఉజ్వల ఆరోగ్యవంతానికి పునాది వేస్తుందని ఐసిడిఎస్ సూపర్ వైజర్ పరిమళ అన్నారు. మంగళవారం బెల్లంకొండ గ్రామం బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో కిశోర వికాస్ కార్యక్రమం ర్యాలీలు నిర్వహించారు. బాలికలకు బాల్య వివాహాలు, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. 11 సంవత్సరాల నుండి 18 ఏళ్ల బాలికలకు విద్య ఆరోగ్యం భద్రత ఆర్థిక స్వావలంబన మెరుగుపరచటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి వెంకట రెడ్డి. అంగన్వాడీ టీచర్లు సీతా, మల్లేశ్వరి, విజయ కుమారి, శోభ ఆశా వర్కర్లు బాజీ, ఎస్తేరమ్మ మహిళా పోలీస్ అనూష కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సందర్శించిన కోఆర్డినేటర్

ప్రజాశక్తి -రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలతోపాటు పసర్లపాడు, పాలు వాయి, తుమ్మరకోట గ్రామాల లోనే భవిత కేంద్రాలను పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డి నేటర్ ఆర్. సిలవ రాజు మంగళవారం సందర్శిం చారు ప్రభుత్వ పరంగా వివిధ రకాల పరికరాలు అందుతున్నాయో లేదా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల గృహాలకూ వెళ్లారు. ఆయన వెంట ఐఈఆర్ పి శివారెడ్డి హరికుమార్ రాజు ఉన్నారు.



పీహెచ్సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదు

ప్రజాశక్తి - దుగ్గిరాల

పది రోజులుగా సమ్మె చేస్తున్న వైద్య ఆరోగ్యా శాఖకు చెందిన ఎమ్మెల్యే హెచ్పి/ సి హెచ్ఓ ఉద్యోగులు ఇతర ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరి కాదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖం డించింది. ఆ శాఖకు చెందిన ఏఎన్ఎంలు సూపర్ వైజర్లు ఇతర సిబ్బంది స్థానిక పిహెచ్సి వద్ద నిరసన తెలిపారు. వారి హక్కుల కోసం పోరాటం తప్పులేదు కానీ ఇతర ఉద్యోగస్తులను విమర్శించడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వంకతార సుబ్బారావు ఏఎన్ఎంలు సూపర్వైజర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రవణ్కుమార్

ఆశా డే యూనిఫామ్ల పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చేబ్రోలు లో ఆశడే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇమ్యూనైజషన్ అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు. ఆరోగ్యశాఖలో జరుగుతున్న వివిధ ప్రోగ్రాం లపై రివ్యూ చేశారని వైద్యాధికారి డాక్టర్ అబ్రహం లింకన్ తెలిపారు. ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందించే వివిధ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ వేసవి ఎండ తీవ్రత దష్ట్యా గ్రామాల్లో ప్రజ లకు అందుబాటులో ఉండి, వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారులకు సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందించే ఆరోగ్య సంబంధిత కార్యక్రమాల లక్ష్యాలు సాధించేందుకు పలు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆశ వర్కర్లకు యూనిఫామ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అబ్రహం లింకన్, డాక్టర్ శైలజ, సిబ్బంది ఆశలు పాల్గొన్నారు.

డిఎస్సిలో ఉర్దూ మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి -మేడికొండూరు

రాష్ట్రంలో జరగబోవు మేగా డియస్సిలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోటీపరిక్షలకు అధికారులు సరియైన నిబంధనలు పాటించక పోవడంతో ఉర్దూ మీడియంలో అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోం దని గుంటూరు జిల్లా ఉర్దూ జాయింట్ జాక్షన్ కమిటీ సభ్యులు షేక్ కరీముల్లా అన్నారు. ఉర్దూ ఉపాధ్యాయ పోటీపరిక్షకు అభ్యర్థులు పదవ తరగతిలో ఉర్దూను మాధ్యమంగా, లేదా పదవ తరగతిలో ఉర్దూను మొదటి భాషగా నైనా చదివి ఉండాలి అన్నారు. ఈ పద్ధతిలో కాకుండా అధికారులు ఇంటర్లో ఉర్దూను, రెండవ భాషగా చదివినా అర్హులుగా పరిగ ణిస్తున్నారు అన్నారు. ఇంటర్లో ఉర్దూను రెండవ భాషగా చదివినా ఉపాధ్యాయ ట్రైనింగ్ ఉర్దూ మాధ్యమం నిబంధన అమలు చేయాలన్నారు. అప్పుడే ఒక అభ్యర్థి ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయుడిగా అర్హులవడం జరుగుతోందన్నారు. టెట్లో ఉర్దూ మీడి యంలో అర్హత పొందిన మార్కులను మాత్రమే పరిగణ లోకి తీసుకోవాలి అన్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి అభ్యర్థులకు న్యాయం చేయాలని అన్నారు.

రక్తదానం ఆరోగ్యానికి మంచిది

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని ఓ వైద్యశాలలో రోగికి శస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరమైంది. వెంటనే వారు పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ని సంప్రదించారు. అసోసియేషన్ సభ్యులు రాణా ప్రతాప్, వంశీకృష్ణ స్పం దించి రక్తాన్ని దానం చేసినట్టు అసోసి యేషన్ అధ్యక్షులు ఉమాశంకర్ మంగళవారం తెలిపారు. రక్తదానం చేయాలనుకునేవారు 8333089722 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

చిలువూరులో మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండల పరిధి చిలువూరు గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ స్టేట్ సెల్ కన్వీనర్ హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ఆధ్వ ర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ మేరకు మంగళ గిరి ఆటోనగర్లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. మద్యం దుకాణాన్ని తొలగించాలని నినా దాలు చేశారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ విశాంత్ కుమార్కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం నాగరాజు, మహిళలు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో మద్యం దుకా ణం ఉందని అయినప్పటికీ అదనంగా మరోటి ఏర్పాటు చేయాలనుకోవడం దారుణమన్నారు. సమీపంలో పాఠశాల ఉందని, ఇటుగా నిత్యం విద్యార్థులు, మహిళ లు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మద్యం వలన కుటుంబాలు ఛిద్రం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మద్యం దుకాణాన్ని తొలగించాలని కోర గా ఎక్సైజ్శాఖ కమిషనర్ ప్రశాంత్ కుమార్ సానుకూలంగా స్పందించారని, మద్యం దుకాణానికి అనుమతులు నిలిపి వేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున గ్రామ మహిళలు, ఎం. రాహేల్, శిఖా సుందరమ్మ, నాగరత్నం, సి.అవ్వమ్మ, సి. నిర్మల, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

టైక్వాండలో బంగారు పతకాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : మహారాష్ట్రలోని నాసిక్లో జరిగిన ఫస్ట్ ఫెడరేషన్ కప్ టైక్వాండో కిడ్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో తెనాలికి చెందిన కెఎస్ఆర్ టైక్వాండో విద్యార్థులు బంగారు పతకాలు సాధిం చారు. ఏప్రిల్ 25 నుంచి మే ఒకటి వరకు జరిగిన పోటీల్లో సబ్ జూనియర్, కాడెట్, జూనియర్, సీనియర్స్, విభాగాల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొనగా సీనియర్ విభాగం "పూంసె"లో కెఎస్ఆర్ అకాడమీ మాస్టర్ కె.శ్రీనివాసరావు బంగారు పతకం కైవసం చేసుకున్నారు. మంగళవారం తెనాలిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీధర్, కనగాల నాగ భూషణం, టి.పోతురాజు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు. చాంపియన్షిప్ పోటీల్లో తెనాలికి



పతకాలు సాధించిన విద్యార్థులతో మురళి, నాగభూషణం

చెందిన కేఎస్ఆర్ అకాడమీ విద్యార్థులు లంకరాజు శిరీష (18 కిలోల విభాగం), షణ్ముఖ అభిరామ్ (20 కిలోల విభాగం), లు బంగారు పథకాలు సాధించగా లంకరాజు శ్రీ సౌర్య (24 కిలోల విభాగం) కాంస్య పతకం సాధించారు.

జూన్లో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జూన్లో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయ ప్రదం చేయాలని ఏపీజిఇఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష అన్నారు. మంగళవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఫిరంగిపురం తాలూకా యూనిట్ కార్య వర్గ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా, జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ గారు ముఖ్యఅతిథిగా విచ్చేసినారు. చాంద్ బాషా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జూన్లో జరగబోయే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు విజయవాడలో నిర్వహిస్తున్నామని కార్యక్రమానికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుని ఆహ్వానిస్తున్నామని తెలి పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్య క్షులు చాంద్ బాషా, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారా యణ, ఫిరంగిపురం తాలూకా యూనిట్ అధ్యక్షులు సుదర్శన్ రాజు పాల్గొన్నారు.


ఐపిఎల్ను తలపించేలా ఎడ్ల బల ప్రదర్శన

ప్రజాశక్తి - చేబ్రోలు

శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయం వడ్లమూడి క్వారీ ప్రాంగణంలో జరుగుతున్న ఒంగోలు జాతి వృషభ రాజుల బలప్రదర్శన కార్యక్రమం ఐదవరోజు మంగళవారం ఉత్కం ఠంగా జరిగింది. మే 1న ప్రారంభమై, 8 వరకు నిర్వహించ నున్న ఈ జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన కార్యక్రమం ఒంగోలు జాతి ఎద్దుల శక్తి దృఢత్వాన్ని నిదర్శి స్తూ ప్రజల్లో చైతన్యాన్ని నింపుతున్నాయి. మంగళవారం 5వ రోజు శారీరకంగా బలిష్టమైన భారీ శరీర ఆకృతి కలిగిన ఎడ్ల బల ప్రదర్శనలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో పశువులను హిం సించట్లేదని కమిటీ స్పష్టం చేశారు. పొన్నూరు ఎమ్మెల్యే



జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెనీ క్రిస్టీన



ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దగ్గరుండి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిష్టినా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్య క్రమంలో చేబ్రోలు మండల తెదేపా అధ్యక్షులు మైలా వెంకట రామరాజు, నాయకులు మేడికొండూరు నరేష్, షేక్ హర్షద్ బాషా, టిడిపి సీనియర్ నేత సిరిపురం శ్రీధర్ పొన్నూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్కు దక్షిణాదిలో ఉత్తమ పాఠశాల పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాలకు లీడ్ స్కూల్ మేనేజ్మెంట్ దక్షిణాది రాష్ట్రాలలో ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని అందించింది. ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి మెరీడియన్ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో లీడ్ స్కూల్ చైర్మన్ సుమిత్ మెహతా, వైస్ ప్రెసిడెంట్ దీపక్ హరిహరన్ చేతుల మీదుగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతకాంత్ దాసరి పురస్కారాన్ని అందుకున్నారు. భారతదేశంలో లీడ్ స్కూల్



పురస్కారం అందుకుంటున్న మురళి కాంత్ గీతా కాంత్

కరికులం అమలు చేస్తున్న 300 పాఠశాలలో నెహ్రూ నికేతన్ స్కూల్ ఒకటి. జోనల్ స్థాయిలో ఉత్తమ పాఠశాలగా నెహ్రూ నికేతన్ ను లీడ్ స్కూల్ ఎంపిక చేసిందని చెప్పారు.



ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలును సత్కరిస్తున్న కలెక్టర్

నారాకోడూరు విద్యార్థికి కలెక్టర్ ప్రశంసలు

ప్రజాశక్తి - చేబ్రోలు

10వ తరగతి 2025 పరీక్షా ఫలితాల్లో జిల్లాస్థాయిలో కష్ట పడి చదివి ప్రతిభ చూపిన ఎద్దు మౌర్య భూషణ్ 585 సా ధించి చేబ్రోలు మండలంలో ప్రథమ స్థానం సాధించింది. మౌర్య భూషణను అంకితభావంతో పని చేసిన టీం వర్క్తో పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు ను కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక దుశ్శాలువాతో సత్కరించారు.



దీక్షల్లో కూర్చున్న ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

154 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 1504 రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో కే వెంకట మోహన్ రావు, ఎం సాంబశివరావు, డి నాగేశ్వరరావు, ఎన్ సుబ్బారావు, సిహెచ్ పిచ్చయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూర పాటి స్టీవెన్, బూరుగ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేలాదిమందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వంసిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎందుకు న్యాయం చేయ డం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఆర్ ఇస్రా యెల్, ఎం గురవయ్య, వై సాంబయ్య, కె అగ్గయ్య, ఎస్.కె సుభాని, టి నాగేశ్వరరావు, వై రమాదేవి, డి రమణ, వి లక్ష్మి, యు కాశమ్మ, డి నాగమల్లేశ్వరి, ఈ చారమ్మ, బి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నేటి తీర్పు మైనింగ్ మాఫియాకి పెద్ద చెంప పెట్టు

ప్రజాశక్తి - చేబ్రోలు

పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనీ, తీర్పు అలస్యం కావచ్చు కానీ చట్టం చేతిలో నేరస్తులు తప్పించుకోలేరి నేటి హైదరాబాద్ సిబిఐ కోర్టు ఓబుళాపురం మైనింగ్ కేసులో నేటి తీర్పే ఉదాహరణ అని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. ఎంతటి రాబందులైనా ఒక్క తుఫానుకే కులతాయని మైనింగ్ మాఫియా మీద ఘాటుగా స్పందించారు. సందర్భంగా ఓబుళాపురం మైనింగ్ మీద 2004-2009 తమ పోరాటాన్ని గుర్తు చేశారు. ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల మీద 2004 -2009 మధ్య తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేసిన మా పోరాటానికి ఫలితం దక్కిందని అన్నారు.

నేటి నుంచి ఆహ్వాన నాటికల పోటీలు

ప్రజాశక్తి - చేబ్రోలు

నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికగా, పొన్నూరు కళా పరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ బుర్రకథ కళా కారులు పద్మశ్రీ షేక్ నాజర్ శత జయంతి సందర్భంగా మే 7, 8, 9, 10 తేదీలలో 24వ తెలుగు ఉభయ రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్నానికి చెందిన తెలుగు యువత నాయకులు కాండ్రు కోమల్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్నంలోని శ్రీకష్ణ చైతన్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని కోమల్కుమార్, రిషితశ్రీ దంపతులు ప్రారం భించారు. యూత్ ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడారు. యూత్ ఫెడరేషన్ చేసే సేవా కార్యక్రమాల్లో తమ తో పాటు పాల్గొంటూ ప్రముఖ పాత్ర పోషిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం చిన్న కాకాని గ్రామంలోని షైన్ అనాథాశ్రమంలో బాల బాలికలకు అన్నదానం చేశారు.

జిఎంసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు

విధుల్లో నిర్లక్ష్యం, పారిశుధ్య పర్యవేక్షణ లోపంపై 8వ శానిటరీ డివిజన్ ఇన్స్పెక్టర్ పి.రాంబాబుని విధుల నుండి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 8వ శానిటరీ డివిజన్ లో కార్మికుల హాజరు రిజిస్టర్‌లో ముగ్గురు కార్మికులు హాజరు నమోదు చేసి ఉండగా, వారు విధుల్లో మాత్రం లేకపోవటం గుర్తించామన్నారు. అలాగే డివిజన్‌లో పారిశుధ్య పనుల పర్యవేక్షణలోనూ రాంబాబు నిర్లక్ష్యంగా ఉండటంతో సస్పెండ్ చేశామన్నారు. 8డివిజన్ ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్‌గా ఏ.బాబుని నియమించామన్నారు.

ఎఎన్‌యు బీటెక్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీటెక్ కోర్సు 2/4 మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాద్ రావు మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలకు 934 మంది హాజరుకాగా 745 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 79.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్ లో పొందుపరిచామని వెల్లడించారు.

డిగ్రీ 6వ సెమిస్టర్‌లో వందశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సు ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అదనపు పరీక్షల నియంత్రణ అధికారి ఏ . వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఈ ఫలితాలను ఇన్చార్జి వీసి ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, డిగ్రీ పరీక్షల ఇంచార్జి కోఆర్డినేటర్ ఆచార్య కృష్ణారావు, ఇన్చార్జి ఓఎస్డి ఆచార్య రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాష్ రావు, వై. రాధకృష్ణ ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షలకు 14009 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు.

గుంటూరు అభివృద్ధిపై కూటమి ముద్ర ఉండేలా పని చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు


మేయర్, కార్పొరేటర్లను అభినందిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

రాష్ట్ర రాజధాని అమరావతిలో భాగమైన గుంటూరు నగరాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, కూటమి ఆధ్వర్యంలో గుంటూరు నగరాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు చంద్రబాబు నాయుడు అన్నారు. సోమ వారం రాత్రి నగర మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి కూటమి కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, నిమ్మల వెంకటరమణ, షేక్.మీరావలి ముఖ్యమంత్రిని ఉండవల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

పాటకు ప్రజల్ని కదిలించే శక్తి ఉంది

పిఎస్ నగర్‌లో మేడే సాంస్కృతిక ఉత్సవాల్లో వై.నేతాజి

ప్రజాశక్తి-గుంటూరు

ఒక సమస్యపై ప్రజలను కదిలించగలిగే శక్తి పాట, నాటిక వంటి సాంస్కృతిక కార్యక్రమాలకు ఉందని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజి అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కార్మికులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సిఐటియు కృషి చేస్తుందన్నారు. మేడే వారోత్సవాలలో భాగంగా మంగళవారం అడవి తక్కెళ్లపాడు, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో మేడే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వాడ వాడలా సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ కార్మికులు ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ విద్యార్థులు వివిధ అభ్యుదయ గీతాలకు నృత్యాలు చేశారు. సిఐటియు నాయకులు జి.లూథర్ పాల్, సిహెచ్ కిన్నర్ అభ్యుదయ గీతాల ఆలపించారు. కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు షేక్.మస్తాన్ వలి, షేక్ ఖాసిం షహీద్, ఆది నికల్సన్, షేక్ బాషా, సి. పద్మనాభుడు, బి.సుకన్య, ఫ్రీ ట్యూషన్ సెంటర్ టీచర్ కె. సుజాత పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో టాపర్లకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు


విద్యార్థుల్ని అభినందిస్తున్న కలెక్టర్, జెసి, ఇతర అధికారులు

జిల్లాలో పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, సంక్షేమ పాఠశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం కలెక్టరేట్‌లో అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్ఎస్‌సి-2025 పరీక్షల్లో 580 మార్కులకుపైన సాధించిన 34 మంది విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో పదవ తరగతి చాలా కీలకమని, దీనిని జయించిన వారు ఏమిచేయాలి అనేది అవగాహన పెంచుకోవాలని, మీకంటూ ఒక లక్ష్యం వుండాలని, మీ భవిష్యత్తును మీరే నిర్ణయించుకోవాలన్నారు.గత మూడేళ్ల నుండి జిల్లా పదవ తరగతి పరీక్షలో చాలా వెనుకబడి వుందని , 2024లో 16వ స్థానం, 2025లో 4వ స్థానం సాధించడం జరిగిందని, వచ్చే సంవత్సరం జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని విద్యా శాఖఅధికారులకు సూచించారు. ఈ ఫలితాలు రావడానికి కృషి చేసిన తల్లితండ్రులకు, ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ కష్టపడి చదివితే ఎటువంటి లక్ష్యాన్ని అయిన సాధించవచ్చని, ప్రైవేట్, కార్పరేట్, టెక్నో స్కూల్స్ కంటే కేవలం ప్రభుత్వ స్కూల్స్‌లో ఉపాధ్యాయుల సహకారంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు.డిఇఓ సి.వి.రేణుక మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పది వేల మంది విద్యార్థులకుగాను 1450 మందికి 500 మార్కులు పైగా సాధించడం జరిగిందని , 580 నుండి 592 వరకు 34 మంది సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను, ఉపాధ్యాయుల్ని, తల్లిదండ్రుల్ని సత్కరించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కె. వెంకటరెడ్డి , ఉప విద్యాశాఖాధికారులు ఏసురత్నం, శాంతకుమారి , యంఇఓ ఖుర్దూస్, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు


ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(ఎంఎల్‌హెచ్‌పి)ల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎపిఎంసిఎ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుండి నగరంపాలెంలోని గుర్రం జాషువా విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి, ఆనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కార్యదర్శి పల్లపాటి లింగరాజు, జిల్లా అధ్యక్షులు టి. ప్రవల్లిక మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం పెంపుదలతో వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలని, ఈపిఎఫ్‌ఓను పునరుద్ధరణ, క్లినికల్ అద్దెబకాయిలు చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అమలు, హెచ్‌ఆర్ పాలసీ అమలు తదితర డిమాండ్లతో గత నెల ఏప్రిల్ నుండి దశల వారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవటంతో నిరవధిక సమ్మె చేస్తున్నామన్నారు. సమ్మెకు మంగళవారం ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని వారే తుంగలో తొక్కుతున్నారని, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల విధులు నిర్వహించిన అనంతరం రెగ్యులరైజ్ చేస్తామని రాతపూర్వకంగా ఉద్యోగస్తులకు హామీ ఇచ్చి, నేడు దాన్ని అమలుపరచుకుండగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు మాట్లాడి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.వనజ, కోశాధికారి సంధ్య, చీఫ్ అడ్వైజర్ కోడాలి సృజన తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి-గుంటూరు


గోనుగుంట్ల కోటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాష్ట్రంలో నిరాదరణకు గురవుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృబాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో కోటేశ్వరరావును కలిసి ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్ని, రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధి వంటి వాటిపై కసరత్తు చేస్తున్నామని చెప్పారు. సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత టిడిపి పాలనలో చంద్రబాబు నిధులు కేటాయించి అభివృద్ధి చేయగా గత పాలకులు ప్రజలు చెల్లించిన 8 శాతం సెస్సు సొమ్మును ప్రక్కదోవ పట్టించారన్నారు. సాహిత్య సభలు, పుస్తక ఆవిష్కరణకు జిల్లా గ్రంథాలయాలు ఉచితంగా గానీ, సాధారణ చార్జీలతో ఇచ్చేందుకు అదేశిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రతినిధులు చలపాక ప్రకాష్ , పరుచూరి అజయ్ కుమార్, సిహెచ్ సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ట, ఎస్ఎమ్ సుభాని ఉన్నారు. ఈ సందర్భంగా గోనుగుంట్లను సత్కరించి గ్రంథాలయ ఉద్యమ పుస్తకాలు అందజేశారు.

జిల్లా గర్వించదగ్గ మహామనిషి బసవపున్నయ్య

ప్రజాశక్తి-గుంటూరు


బసవపున్నయ్యను సత్కరిస్తున్న మద్దినేని గోపాలకృష్ణయ్య, తదితరులు

ఆరు దశాబ్దాలకుపైగా వైద్యులుగా, విద్యాప్రదాతగా ఘనత వహించిన డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య జిల్లా గర్వించదగ్గ మహామనీషి అని డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య అన్నారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై బసవపున్నయ్య 93వ పుట్టినరోజు సందర్భంగా జీవన సాఫల్య పురస్కారం అందజేశారు.ఈ సందర్భంగా గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ 5 దశాబ్దాలకు పైగా కమ్మ హాస్టల్ అధ్యక్షునిగా వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేశారన్నారు. నాగార్జునా ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా జెకెసి కళాశాల, ఆర్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాల, హనుమయ్య ఫార్మసీ కళాశాల, మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలల స్థాపనతో పాటు కేఎల్‌పి స్కూల్ అధ్యక్షునిగా ముఖ్య భూమిక పోషించారన్నారు. తమ మాతృమూర్తి పేరున వృద్ధుల ఆశ్రమం స్థాపించి ఇతోధికంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ యర్ర నాగేశ్వరరావు బసవపున్నయ్య సేవలను కొనియాడారు. సభకు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, దేవస్థానం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరావు, మోదుగల రవికృష్ణ, సేవాసంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు, డాక్టర్ బసవ పున్నయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో మంగళ వారం అలెంబిక్ ఫార్మాసుటికల్స్ లిమిటెడ్ వారు వర్చువల్ వర్చ్యువల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు తమ కళాశాల నుంచి 50 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియ చేశారు. ఈ కార్యక్రమానికి అలెంబిక్ ఫార్మాసుటికల్స్ లిమిటెడ్


ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

హెచ్.ఆర్ మేనేజర్లు ఫహీం షేక్, శ్రీధర్ పాల్గొని విద్యార్థులకు మెడికల్ రిప్రజంటేటివ్ ఉద్యోగాల కొరకు ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సీతారామయ్య , డాక్టర్ ఎ. ప్రత్యూష , ప్లేస్ మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.